క్లుప్తంగా

తిరుచ్చిపై శ్రీసూర్యనారాయణ స్వామి



తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీసూర్యనారాయణ స్వామివారు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామివారు శనివారం తిరుచ్చి వాహనంపై భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేకాది కార్యక్రమాల అనంతరం మూలమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. సాయంత్రం స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమేష్, సుభాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో ఆసుపత్రిలో రోబోటిక్ థొరాసిక్ సర్జరీ



డాక్టర్ అజయ్ నరసింహన్

తిరుపతి తుడా: అపోలో ఆసుపత్రిలో అత్యాధునిక రోబోటిక్ థొరాసిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెన్నై అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అజయ్ నరసింహన్ తెలిపారు. శనివారం స్థానిక లక్ష్మీపురం సర్కిల్లోని అపోలో ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న టెక్నాలజీని దృష్టిలో ఉంచుకొని అపోలో హాస్పిటల్‌లో ఈ సేవలు ప్రారంభించామన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా కచ్చితత్వం, మెరుగైన ఫలితాలు అందిస్తాయన్నారు. థొరాసిక్ సర్జరీలు అవసరమయ్యే రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి సురక్షితమైన వైద్యం అందించగలమన్నారు. ఈ రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అతి తక్కువ హానికర శస్త్ర చికిత్సా విధానమని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, ఇతర ఊపిరితిత్తుల పరిస్థితులకు, ఇతర అవయవాలకు చికిత్స చేయడానికి ఈ విధానాలు ఎంతో కీలకమైనవని తెలిపారు.

వైభవంగా శ్రీబాలగుర్రప్ప స్వామి బ్రహ్మోత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న శ్రీబాల గుర్రప్పస్వామి

భాకరాపేట: శ్రీబాలగుర్రప్ప స్వామి బ్రహ్మోత్సవాలకు భక్త జనం పోటెత్తారు. శనివారం సాయంత్రం సిద్ధపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామున స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో నిద్ర మేల్కొలిపి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, అర్చనలు, నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సిద్ధపూజకు ముక్కోటి దేవతలను, దిక్పాలకులను, మునులను, గంధర్వులను ఆహ్వానించి, సిద్ధులతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నదాన కార్యక్రమం బ్రహ్మోత్సవాలు ప్రారంభం నుంచి నిరంతరాయంగా కొనసాగుతోంది.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ



దేవరకొండ గ్రామంలో సెలవు రోజుల్లో సాగుతున్న ఆక్రమణలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో దేవరకొండ రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ జోరుగా సాగుతుంది. శనివారం సెలవు కావడంతో భారీగా యంత్రాలు తీసుకొచ్చి ప్రభుత్వ భూమిలో ఉన్న ముళ్ల పొదలను తొలగించే పనులు చురుగ్గా కానిచ్చేశారు. దేవరకొండ పంచాయతీ మల్లెలవాండ్లపల్లె సమీపంలోని సర్వే నంబరు 586లోని రహదారి పోరంబోకు విస్తీర్ణం 5.30 భూమి, సర్వే నంబరు 534లో చెరువు పోరంబోకు విస్తీర్ణం 31.50 ప్రభుత్వ భూమిలో సెలవు రోజుల్లో చకచకా పనులు కానిచ్చేస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు, గ్రామ సర్పంచ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పనులు ఆపే ప్రయత్నం చేయలేక పోతున్నారు. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో అధికారులు ఉండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోక పోవడంతో గ్రామాల్లో సామాజిక అవసరాలకు, గ్రామాల్లో పశువులు, సన్న జీవాలు ఎక్కడ మేపు కోవాలని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంక్షలు పెడితే.. ఆందోళనలు తప్పవు

- బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' అందించాలి
- ఎన్నికల హామీ అమలు చేసి తీరాల్సిందే
- కాలయాపన తగదు
- పథకాలపై ఆంక్షలు విధిస్తే అసెంబ్లీని ముట్టడిస్తాం
- బాబు సర్కార్‌కు విద్యార్థి సంఘాల హెచ్చరిక

ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేయాలి. పేదలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని అధికారం చేపట్టాక పథకాలపై ఆంక్షలు పెడుతూ కాలయాపన చేస్తే పేదల పక్షాన ఉద్యమిస్తాం. సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లి ఖాతాలో నగదు జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే హామీని బాబు సర్కార్ కొనసాగించాలి. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడిచింది. కాలయాపన చేయకుండా తల్లికి వందనం పథకాన్ని వెంటనే వంద శాతం అమలు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నాయి. -తిరుపతి సిటీ

తల్లికి వందనం పథకం అమలుకు తూట్లు పొడుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు విధించడం విద్యార్థి లోకాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. లబ్ధిదారులను తగ్గించడానికే చంద్రబాబు ప్రభుత్వం ఆంక్షలు పెడుతోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆధార్ కార్డు లేదా పది రకాల గుర్తింపు కార్డులు, 75శాతం హాజరు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారికే పథకం వర్తింపు అంటూ షరతులు



పెడితే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా నిరుద్యోగ భృతి, 56వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్, కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1500 షరతులు లేకుండా అమలు చేయాలంటూ ఐక్య విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి.

కండిషన్స్ అప్లై అంటే కుదరదు



ఎటువంటి షరతులు లేకుండా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికీ ఈ పథకం అందించి తీరాలి. తల్లికి వందనంపై ఇటీవల జీఓ నెం.29ను ప్రభుత్వం ఎందుకు విడుదల చేసిందో అర్థం కాలేదు. షరతులు పెట్టే ఆలోచనలేనప్పుడు జీఓను ఎందుకు విడుదల చేయాలి. జీఓలో స్పష్టత లేకపోవడంతో చాలా మందిలో అయోమయ పరిస్థితి తలెత్తింది. మాట ఇచ్చిన ప్రకారం బాబు సర్కార్ వెంటనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. లేదంటే పేద విద్యార్థులకు అండగా నిలబడి ఉద్యమిస్తాం.

-శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి

ఫీజుల చెల్లించాలంటూ ఒత్తిడి



ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారు. అమ్మ ఒడి స్థానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకాన్ని బాబు సర్కార్ వెంటనే విద్యార్థులకు అందించాలి. కండిషన్స్‌తో కాలయాపన చేస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదు. పథకం అమలులో ఆంక్షలు విధించడమంటే పేద విద్యార్థుల కడుపు కొట్టడమే. హామీలు ఇచ్చే సమయంలో షరతులు గుర్తుకు రావా.. అధికారం చేపట్టిన తర్వాతే పాలకుల కు షరతులు, మెలికలు పెట్టడం అలవాటుగా మారింది. తక్షణం తల్లికి వందనం అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

-జె.మల్లికార్జున, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి

కూటమిలో భాగస్వామ్యులు నోరు విప్పాలి



విద్యార్థుల జీవితాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుకుంటున్నాయి. నీట్ పేపర్ లీక్‌పై కనీసం రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి నేతలు పవన్‌కల్యాణ్, చంద్రబాబు, పురందేశ్వరి అండ్ కో ఎవరూ నోరు మెదపలేదంటే మనం అర్థం చేసుకోవచ్చు విద్యార్థులపై వాళ్లకు ఉన్న నిబద్ధత. అదే విధంగా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలో ఎంతమంది బడికి వెళ్తున్నా అందరికీ అందిస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పుడు పథకాన్ని అమలు చేయడంలో మెలికలు పెడుతూ ఆంక్షలు విధించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పవన్ కల్యాణ్ స్పందించాల్సిన అవసరం ఉంది. ప్రతి విద్యార్థికి పథకం అందకపోతే ప్రభుత్వాన్ని నిలదీస్తాం.

-రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఆంక్షలు విధిస్తే అసెంబ్లీని ముట్టడిస్తాం



తల్లికి వందనం పథకానికి ఆంక్షలు విధించి పేదల కడుపుకొడితే విద్యార్థి సంఘాలతో కలసి అసెంబ్లీని ముట్టడిస్తాం. తక్షణం ఇచ్చిన మాట ప్రకారం షరతులు లేకుండా తల్లికి వందనం పథకం అమలు చేయాలి. అదేవిధంగా ఎటువంటి కండిషన్స్ లేకుండా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ప్రతి నిరుద్యోగ అభ్యర్థికి అందజేయాలి. రాష్ట్రంలో ఉన్న సుమారు 56 వేల పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి. అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. లేని పక్షంలో విద్యార్థి సంఘాలు ఉద్యమ బాటలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం.

-కె.ఆది, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందించాలి



పేద ప్రజలకు కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. ఆంక్షలు విధిస్తే ఊరుకునేది లేదు. కుటుంబంలో బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు తల్లికి వందనం పథకం ద్వారా అందించాలి. ఆధార్‌కార్డు ఒకటో తరగతి చదివే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉంటుంది. గుర్తింపు కార్డుల పేరుతో అనవసర రాద్ధాంతం చేసి విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నారు. స్పష్టత లేని జీఓలను ప్రభుత్వం విడుదల చేయడం దారుణం. మాట ఇచ్చిన ప్రకారం పథకాన్ని ప్రతి విద్యార్థికి అందించాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఐక్య పోరాటం చేస్తాం.

-ఆర్.ఆశ, పీడీఎస్ఓ, జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి

ఆంక్షలు లేకుండా సూపర్ సిక్స్ అమలు చేయాలి



బాబు సర్కార్ అధికారం కోసం సూపర్‌సిక్స్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లింది. ప్రజలు నమ్మి ఓటు వేసి అధికారం ఇచ్చారు. ఆంక్షలు విధిస్తూ సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామంటే సహించేదిలేదు. తల్లికి వందనం ప్రతి విద్యార్థికి అందించాల్సిందే. దీంతో పాటు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు చొప్పున ప్రతి నిరుద్యోగికి అందించాలి. కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాలి. వీటిలో ఒక్కటీ ఇంతవరకు అమలు చేయలేదు. షరతులు పెట్టి కాలయాపన చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు కనబడుతోంది. అలా జరిగితే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ధర్నాలు, సమ్మెలు తప్పవు.

-హరీష్, ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ, రాష్ట్ర సభ్యులు, తిరుపతి

రాంగ్ రూట్ గొడవలు

తిరుపతి అర్బన్: శ్రీనివాస సేతుపై రాంగ్ రూట్ గొడవలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు త్రుటిలో తప్పుతున్నాయి. అయినా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్న క్రమంలో గత ప్రభుత్వంలో శ్రీనివాస సేతును నిర్మించారు. దీంతో ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గింది. అయితే వంతెన నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో కేవలం ఆర్టీసీ బస్సులు మాత్రమే వెళ్లాల్సి ఉంది. అయినప్పటికీ పలు ప్రైవేటు వాహనాలు వెళ్తున్నాయి. మరోవైపు బస్టాండ్‌లో నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, పలు కార్లు రాంగ్‌రూట్‌లో వంతెనపైకి వచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సులకు నిత్యం ప్రమాదాలు త్రుటిలో తప్పుతున్నాయి. ఈ విషయంపై గతంలో పలువురు ప్రయాణికులు ఆర్టీసీ పెద్దలకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కనిపించడం లేదు.

ప్రత్యేక నిఘా పెడుతాం....

శ్రీనివాస సేతుపై బస్టాండ్‌లో నుంచి రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వారిపై జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలు చేపడుతాం. వంతెనపై నుంచి బస్టాండ్‌లోకి వచ్చే మార్గంలో ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉంది. అయినప్పటికీ ద్విచక్రవాహనాలు వస్తున్నాయి. అయితే కార్లకు అనుమతి లేదు. ప్రధానంగా బస్టాండ్‌లో నుంచి వంతెనపైకి రాంగ్ రూట్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఏ వాహనానికి అనుమతి లేదు. అలా వెళితే సీరియస్‌గానే పరిగణిస్తాం.

-డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న ఈఓ జె.శ్యామలరావు

తిరుపతి(అలిపిరి): తిరుమల, తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనకు టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి ఘన స్వాగతం పలికారు. అనంతరం సమావేశమై టీటీడీపై చర్చించారు. జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ నిపుణుడు దామోదర్ నాయుడు



ఆర్గానిక్ మేళాను తిలకిస్తున్న ప్రజలు



తాటి, కొబ్బరి ఆకులతో బొమ్మల తయారీపై పిల్లలను శిక్షణ ఇస్తున్న నిర్వాహకుడు



ఆర్గానిక్ మేళాలో వివిధ రంగులలో గురివింద గింజలు

తిరుపతి కల్చరల్: ప్రకృతి వ్యవసాయ ఆధారిత పంటలు, ఉత్పత్తుల వినియోగంతో అందరూ పరిపూర్ణ ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు దామోదర్ నాయుడు పిలుపునిచ్చారు. కనెక్ట్-2 ఫార్మర్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో సిరి సంత పేరుతో గో ఆధారిత, ప్రకృతి వ్యవసాయ రైతులతో మహతి కళాక్షేత్రంలో తలపెట్టిన రెండు రోజుల ఆర్గానిక్ మేళాను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం చేసే విధానం, తద్వారా కలిగే ప్రయోజనాలను క్షుణ్ణంగా వివరించారు. అనంతరం తాను కనుగొన్న అటవీ జంతువుల నుంచి రక్షించుకొనే టార్చ్‌లైట్ యంత్రాన్ని ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ ఆదర్శరైతు టి.నాగరాజు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో రసాయనాలతో కూడిన పంటల వినియోగంతో అనారోగ్యం తప్పడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగిస్తూ ఆరోగ్య వంతులుగా జీవించాలని కోరారు. మరో వక్త అనిల్ కంచె మాట్లాడుతూ జీరో కార్బన్ వ్యవసాయం, వాతావరణం మార్పులకు అనుగుణంగా మన సొంత ఇంటిని సౌకర్యవంతంగా ఎలా మార్చుచేసుకోవచ్చనే విషయాలను వివరించారు. కనెక్ట్-2 ఫార్మర్ సంస్థ కో ఆర్డినేటర్ రాధా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి శని, ఆదివారం రెండు రోజుల పాటు ఆర్గానిక్ మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేళాలో దేశీయ విత్తనాలు, గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, ఆయుర్వేదం, పంచగవ్య ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, చేతి వృత్తి వస్తువులు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఆర్గానిక్ మేళాలో భాగంగా తొలి రోజు పిల్లలకు మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయడం, విత్తనాలతో రాఖీలు తయారీ, తాటి, కొబ్బరి ఆకులతో బొమ్మలు తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనెక్ట్-2 ఫార్మర్ వ్యవస్థాపకురాలు శిల్ప, సభ్యులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు



తిరుమల కొండకు శనివారం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు రెండు రోజులు సెలవు దినాలు కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వెళ్లే క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. గదులు దొరక్కపోవడంతో భక్తులు వీధులు, మండపాల్లోనే సేదదీరడం కనిపించింది. -తిరుమల















చంద్రగిరి కోట పరిసరాల్లో తవ్వకాలు



రైతు పొలంలో జేసీబీ సాయంతో పనులు నిర్వహిస్తున్న క్రమంలో బయటపడ్డ పురాతన రాళ్లు

- బయటపడ్డ పురాతన కట్టడాల రాళ్లు
- పనులు నిలిపి వేసిన ఆర్కియాలజీ అధికారులు



లభ్యమైన పురాతన రాళ్లను కుప్పగా ఉంచిన దృశ్యం

చంద్రగిరి: రాయలవారి కోట ప్రహరీ ఆవరణంలోని భూముల్లో రైతులు చేపట్టిన జేసీబీ తవ్వకాల్లో పురాతన రాళ్లు లభ్యమైనట్లు తెలిసింది. లభ్యమైన రాళ్లు అతిపురాతనమైనవి కావడంతో ఆర్కియాలజీ అధికారులు పనులు నిలిపివేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. చంద్రగిరి కోటలో రోజురోజుకూ జేసీబీ తవ్వకాలు ఎక్కువైపోయాయి. కోట ప్రహరీ ఆవరణలో రైతుల భూములు ఉండడంతో వారు సెలవు దినాలు, ఎప్పుడు పడితే అప్పుడు జేసీబీ పెట్టి తవ్వకాలు జరపడం పరిపాటిగా మారింది. ప్రహరీ గోడ నుంచి 100 మీటర్ల లోపు ఎలాంటి తవ్వకాలు జరగకూడదని నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఈ క్రమంలో చంద్రగిరి పట్టణానికి చెందిన ఓ రైతు తమ పొలంలో మామిడి చెట్లు నాటేందుకు శనివారం జేసీబీ సాయంతో చదును చేసేందుకు ప్రయత్నించాడు. జేసీబీ తవ్వకాలు జరుపుతుంటే పురాతనమైన రాళ్లు బయటపడ్డాయి. ఈ రాళ్లు చంద్రగిరి కోట ఏర్పాడినప్పుడు ప్రహరీకి వాడిన రాళ్లుగా అధికారులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఆర్కియాలజీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు నిలిపివేశారు. ఇక్కడ ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని ఆదేశాలు జారీ చేశారు. బయటపడ్డ పురాతన రాళ్లపై తిరిగి జేసీబీతో మట్టి పోయించి కప్పివేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి





అన్నమయ్య సర్కిల్లో నిరసన, పూలే విగ్రహం వద్ద ఏపీ బీసీ విద్యార్థి సంఘం నేతల నిరసన

తిరుపతి కల్చరల్: నందికొట్కూరు నియోజకవర్గంలోని ముచ్చుమర్రి గామంలో చిన్నారి బాలికను అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని ఏపీ బీసీ విద్యార్థి విభాగం నేతలు డిమాండ్ చేశారు. బాలిక హత్యను నిరసిస్తూ, బాలిక ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఏపీ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బాలాజీ కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో చిత్తూరు జిల్లాలో వడ్డెర కులానికి చెందిన ఆడబిడ్డపై, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో బీసీ ఆడబిడ్డపై, ప్రస్తుతం నంద్యాల జిల్లాలో ఇలా దుర్మార్గమైన సంఘటనలు జరగడం అమానుషమన్నారు. రాష్ట్రంలో బీసీ కులాలపై దాడులతోపాటు అమాయకులైన ఆడబిడ్డలపై ఇలాంటి దుశ్చర్యలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాలిక హత్యకు కారుకులైన వారిపై కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రా, రాయలసీమ జైభారత్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భార్గవ్‌సాయి, నాయకులు రామాంజిసాగర్, పవన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో..

బీసీ విద్యార్థి సంఘం నేత విజయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం సాయంత్రం బీసీ హాస్టల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. సేవ్ గర్ల్స్ నినాదంతో విద్యార్థులు ర్యాలీగా అన్నమయ్య సర్కిల్‌కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక శవాన్ని కూడా మాయం చేస్తే ఇంత వరకు కనిపెట్టలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉండడం సిగ్గు చేటన్నారు. కేవలం బడుగుల పిల్లలకు అన్యాయం జరిగితే ప్రభుత్వాలు రోజుల తరబడి విచారణ పేరుతో కాలయాపన చేస్తూ న్యాయం చేయలేని పరిస్థితి దాపురించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాలికను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించి బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి నాయకులు బి.బజరంగి, వంశీ, మల్లికార్జున, జి.శ్రావణి, కె.కల్యాణి, జె.రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.